నేడు యథావిధిగా పిజిఆర్ఎస్

ప్రజాశక్తి - కాకినాడ

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న పిజిఆర్ఎస్ కార్యక్రమం సోమవారం కలెక్టరేట్‌లో యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో దాఖలైన అర్జీల పురోగతి, తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చునని తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులంతా విధిగా హాజరుకావాలన్నారు. పిజిఆర్ఎస్‌కు రాలేని అర్జీదారులు వారి యొక్క అర్జీలను Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చన్నారు.

ఉపాధికి లేదు హామీ

- జిల్లాలో రూ. 6.14 కోట్ల ఉపాధి నిధుల పెండింగ్
- ఉపాధి హామీ చట్టంలో చోటుచేసుకోనున్న మార్పులు
- రాష్ట్ర వాటాతో నిధుల కేటాయింపు ఇబ్బందికరమే
- 'ఉపాధి హామీ' నిర్వీర్యానికి కుట్ర

ప్రజాశక్తి - రాజోలు

ఉపాధి కూలీల ఆవేదన అంతా ఇంతా కాదు.. పనిచేసినా కూలి డబ్బులందక లబోదిబోమంటున్నారు.. జాబ్ కార్డు పట్టుకుని అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. మరో వైపు ఉపాధి పనులు పెండింగ్ పడ్డాయి. ఎందుకంటే ఒకటా రెండా మూడు నెలలుగా ఉపాధి నిధులు పెండింగ్‌లో పడ్డాయి.. రూ.కోట్ల నిధులకు ఎదురుచూపులు తప్పడంలేదు. ఉపాధి చట్టం పేరు చెబితే అటు కూలీలు ఆసక్తి చూపడం లేదు.. ఇటు అధికారులు ఆ సంగతే మర్చిపోయారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు.. జిల్లాలో రూ. 6.14 కోట్లు పెండింగ్ ఉన్నట్టు సమాచారం .జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో మార్పులు చోటు చేసుకోబోతున్నాయి. మహాత్మాగాంధీ పేరుకు బదులు వివిజి రామ్‌జీ చేర్చడం ఒక అంశమైతే.. ఇంకా ఉపాధి హామీ చట్టంలో ఎలాంటి మార్పులు చోటుచేసుకోబోతున్నాయోనన్న చర్చ సర్వత్రా నెలకొంది. రెండు దశాబ్దాల క్రితం నాటి యుపిఎ ప్రభుత్వం ఈ చట్టాన్ని తెచ్చింది. మార్పులు జరిగితే కొన్ని ప్రతికూలతలు, మరికొన్ని అనుకూలతలు ఉండనున్నట్లు తెలుస్తోంది. చట్టాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానించాలన్న డిమాండ్ ఓవైపు ఉండగా, మార్పుల తర్వాత ఉన్న పనులు నీరుగారే ప్రమాదమున్నదన్న చర్చ సాగుతోంది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వమే పూర్తి స్థాయి నిధులు కేటాయించే ఈ చట్టంలో ఇప్పుడు కేంద్రం, రాష్ట్ర వాటాలు ఉండాలని నిర్ణయించనుండటంతో నిధుల కొరతతో ముందుకు సాగుతుందా? అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కాగా ప్రస్తుతం చేపట్టే పనుల్లో చాలావరకు నిర్మాణాత్మకమైన పనులు లేకపోవడంతో కొత్తగా వచ్చే మార్పులలో నిర్మాణాత్మకమైన పనులను ఎక్కువగా చేయించాలన్న ఆలోచన చేస్తున్నారు.

చెల్లించాల్సిన బకాయిలు

జిల్లా ఉపాధి కూలీల కు ప్రభుత్వం రూ.6.14 కోట్ల మేర వేతన బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి డిసెంబరు 15 వరకు 45.65 లక్షల మంది కూలీల పనిదినాలకు సంబంధించి ప్రభుత్వం రూ.135.95 కోట్ల బకాయిలను చెల్లించాల్సి ఉంది. ఏప్రిల్ నెల నుంచి జూలై 20 వరకు రూ.129.81 కోట్లను ఉపాధి కూలీలకు ప్రభుత్వం జమ చేసింది. ఇక పెండింగ్లో 1.99 లక్షల పనిదినాలకు సంబంధించి రూ.6.14 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఈ మొత్తం అమౌంట్ జూలై 21 నుంచి డిసెంబరు 15 వరకు జరిగిన వివిధ రకాల ఉపాధి పనులకు సంబంధించిన పెండింగ్ అమౌంట్ అధికారులు భావిస్తున్నారు. జిల్లా పరిధిలో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు 8488 పనులు చేసినట్టు అధికారులు చెబుతున్నారు.

125 రోజుల పనిదినాలు

ఉపాధి హామీ చట్టానికి ఇప్పటివరకు మొత్తం కేంద్ర ప్రభుత్వమే నిధులు కేటాయిస్తోంది. ఇప్పుడు కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం వాటా భరించాలని తెస్తున్న నిబంధనలు ఉపాధి హామీ చట్టం అమలుకు ప్రతిబంధకంగా మారనున్నాయి. రాష్ట్రాలు అంతమొత్తం భరించి 'ఉపాధి హామీ'ని ఇదివరకు తరహాలో కొనసాగిస్తుందా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రస్తుతం చేపడుతున్న పనుల్లోనూ మార్పులు చేర్పులు జరుగుతున్నాయి. ప్రస్తుతం 100 రోజుల పని దినాలే చేస్తున్నారు. జాబ్‌కార్డులో నలుగురు వ్యక్తులుంటే ఒక్కొకరు ఏడాదికి 25 రోజులు, ఇద్దరు ఉంటే 50 రోజుల చొప్పున పని చేసుకునే అవకాశం ఉంది. కొత్త చట్టంలో 125 రోజులకు పెంచారు. కూలీలకు వేతనాలను 15 రోజుల గడువు కింద చెల్లిస్తుండగా దాన్ని వారానికి కుదించారు. అంటే చేసిన పనికి ఉపాధి కూలీకి వారంలోగా చెల్లించాలి. వ్యవసాయ సీజన్‌లో 60 రోజుల పాటు పని కల్పించడం నిలిపివేయాలని ప్రతిపాదించడం కొంత కలవర పాటుకు గురిచేస్తోంది. పథకం కింద అయ్యే ఖర్చులో కేంద్రం 90 శాతం, రాష్ట్రం 10 శాతం నిధులు భరిస్తుండగా, కొత్త ప్రతిపాదిత బిల్లులో కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం భరించాలనే నిబంధన విధించడంతో ఆర్థిక భారంతో రాష్ట్రంలో చేపట్టే పనులు తగ్గుతాయనే ఆందోళనలు వెల్లువెత్తుతున్నాయి.

నిధుల్లో కోతతో రాష్ట్రాలకు భారం

కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఓ పథకం ప్రకారం కుట్రలు చేస్తూ పేద రైతు, కూలీలకు అండగా ఉన్న మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్ర చేస్తోంది. ఈ చట్టాన్ని బలహీనం చేసేలా సవరణ తీసుకు రావడం పేదల హక్కులపై దాడి చేయడమే. మహాత్మా గాంధీ పేరు పూర్తిగా తొలగించి పూజ్య బాపూగా మార్చడం గాంధీజీని అవమానించడమే. ఈ సవరణ బిల్లు పేదల జీవనాధారమైన ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేలా ఉంది. 100 రోజుల ఉపాధి హామీకి భరోసా లేకుండా చేయడం కాకుండా కేంద్రం నుంచి ఇవ్వాల్సినదిట్లో కోతలు పెడుతూ రాష్ట్రాలకు భారాన్ని మారుతోంది.

-కారెం వెంకటేశ్వరరావు, సిపిఎం జిల్లా కన్వీనర్

విన్నర్ ట్రోఫీని అందజేస్తున్న టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎంఎల్ఎ వర్మ, అసోసియేషన్ ప్రతినిధులు

ముగిసిన బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు

ప్రజాశక్తి - పిఠాపురం

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గత రెండు రోజులుగా జరుగుతున్న 9వ ఎలైట్ ఉమెన్ స్టేట్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ముగిశాయి. రెండో రోజు పోటీలను టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎంఎల్ఎ ఎస్‌విఎస్ఎన్.వర్మ ప్రారంభించారు. ఈ పోటీలలో ఓవరాల్ ఛాంపియన్‌షిప్ విన్నర్‌గా విశాఖపట్నం జిల్లా, రన్నర్‌గా కాకినాడ జిల్లా, మూడో స్థానంలో నెల్లూరు జిల్లా నిలిచాయి. అనంతరం వర్మ చేతుల మీదుగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. వివిధ విభాగాల్లో 10 మంది బాక్సర్స్ స్వర్ణ పతకాలు సాధించారు. విశాఖ జిల్లాకు చెందిన ఎస్.సాయివర్షిత, ఎస్‌జిఇఎస్. మల్లిక, ఎండి మెహర్వున్నిసా బేగం, కె.షైనీశ్రీ, ఎస్ దీపిక, జె.స్వప్న, వి.రేష్మ, బి.మౌనిక(అనకాపల్లి), పి.సునీత (విజయనగరం), బి.భవాని(అనంతపురం) స్వర్ణ పతకాలను సాధించారు. డిసెంబర్ 31వ తేదీ నుంచి జనవరి 5వ తేదీ వరకూ ఉత్తరప్రదేశ్‌లో జరిగిన జాతీయస్థాయి మహిళ బాక్సింగ్ పోటీల్లో స్వర్ణ పతకాలు సాధించిన విజేతలు పాల్గొంటారని నిర్వహణ కార్యదర్శి పి.లక్ష్మణరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షులు ఇమిడిశెట్టి నాగేంద్రకుమార్, ఆంధ్రప్రదేశ్ బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఐ.వెంకటేశ్వరరావు, పి.మధుసూదనరావు, పలువురు టిడిపి నాయకులు, బాక్సింగ్ కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఘనంగా నేషనల్ కరాటే పోటీలు

ప్రజాశక్తి - సామర్లకోట

విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

స్థానిక డిఎన్ఆర్ ఫంక్షన్ హాల్‌లో విక్టరీ షోటో ఖాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి 4వ ఓపెన్ ఛాంపియన్‌షిప్ కరాటే పోటీలు ఘనంగా జరిగాయి. కరాటే అసోసియేషన్ విశాఖ జోన్ చీఫ్ డి.శంకర్రావు ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో సుమారు పది రాష్ట్రాలకు చెందిన 1000 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.భీమేశ్వర లైన్స్ క్లబ్ సహకారంతో నిర్వహించిన పోటీలను లయన్స్ డిస్టిక్ గవర్నర్ ఈదల ఈశ్వరకుమార్, మొదటి వైస్ గవర్నర్ చిట్నీడి శ్రీనివాసరావు, కరాటే అసోసియేషన్ ఇండియా చీఫ్ మల్లికార్జున గౌడ్ జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారుల ఆత్మరక్షణకు కరాటే క్రీడ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ క్రీడల్లో రాణించడం ద్వారా విద్యార్థులు ఉన్నత స్థితికి చేరుకునే అవకాశం ఉందని తెలిపారు. ప్రతి విద్యార్థి కష్టపడి క్రీడల్లో రాణించాలన్నారు. గత పదేళ్లుగా ఏ ప్రయోజనం ఆశించకుండా విద్యార్థులకు ఆత్మరక్షణ క్రీడలో శిక్షణ ఇస్తున్న కోచ్ శంకర్‌ను పలువురు అభినందించారు. పోటీలో విజేతలకు పథకాలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో లైన్స్ భీమేశ్వర అధ్యక్షులు అమలకంటి శ్రీనివాసరావు, కార్యదర్శి బడుగు సీతారామరాజు, కోశాధికారి ఏలేటి రమేష్, డిస్టిక్ ఛైర్మన్ చిత్తూరు వీర్రాజు, నాయకులు మేకా శ్రీనివాసరావు, గుండు శంకర్రావు, గిడుతూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కళాశాల ప్రొఫెసర్లతో విద్యార్థులు

వినూత్న ఆలోచనలకు నాంది పలకాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించే వినూత్న ఆలోచనలు చేయాలని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ప్రొఫెసర్ సత్యనారాయణ అన్నారు. ఆదివారం పటవల లోని పైడా కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో ఐఐసి ఆధ్వర్యంలో డిజైన్ థింకింగ్ అండ్ ఇన్నోవేషన్, క్రిటికల్ థింకింగ్ పై రెండు రోజుల వర్క్‌షాప్ ప్రారంభం అయింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తదనాన్ని, ఆధునీకతను తెచ్చే ఆలోచనల వల్ల నూతన ఆవిష్కరణలు ఆవిష్కృతమవుతాయన్నారు. అందుకు తగిన రీతిలో విద్యార్థులు తమలో దాగివున్న సృజనాత్మకతను వెలికితీసేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఇంటరాక్టివ్ సెషన్, ప్రాజెక్ట్ వర్క్ అలాట్మెంట్, డిజైన్ థింకింగ్, ఇన్నోవేషన్, క్రిటికల్ థింకింగ్ అంశాలపైన, కేస్ స్టడీస్ చర్చ, విద్యార్థి బృందాల సమస్యల పరిష్కార ఆలోచనల ప్రదర్శన, ప్రాజెక్ట్ వర్క్ వంటి అంశాలపై వర్క్ షాప్ జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఐఐసి కోఆర్డినేటర్ ఓంకార్, ప్రిన్సిపల్ పివి.సూర్య ప్రకాష్, కళాశాల యాజమాన్యం సత్యశ్రీరామ్, ఎం.వీరభద్రరావు పాల్గొన్నారు.

చిన్నారుల భవితకు 'రెండు చుక్కలు' రక్ష

అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని వైద్య ఆరోగ్యశాఖామంత్రి సత్యకుమార్ యాదవ్ కాకినాడలో ఆదివారం ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా పల్స్ పోలియో విజయవంతానికి పటిష్ట చర్యలు తీసుకున్నట్లు మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రకటించారు. జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామాల్లోనూ వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బందితోపాటు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

కాకినాడ స్థానిక రామారావుపేటలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని మంత్రి మంత్రి సత్యకుమార్‌యాదవ్, ఎంఎల్‌ఎలు వనమాడి వెంకటేశ్వరరావు, పంతం నానాజీ, వరుపుల సత్యప్రభ, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, డిఎంహెచ్ఒ నరసింహనాయక్, ఇతర అధికారులతో కలిసి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమం సక్రమంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసామన్నారు. ఈ పల్స్ పోలియో కార్యక్రమానికి అన్ని జిల్లాల్లో 98,99,300 డోస్‌లు అందుబాటులో ఉంచామన్నారు. 5 ఏళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేసేలా పటిష్ట చర్యలు చేపట్టామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 54,07,663 మంది 5 ఏళ్ల లోపు పిల్లలకు 38,267 బూత్‌లలో పోలియో చుక్కలు వేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు అన్ని జిల్లాలకు నోడల్ ఆఫీసర్లను నియమించామన్నారు. రాష్ట్రంలో అన్ని వైద్యశాలలో, ప్రాథమిక వైద్యశాలలు, పాఠశాలలు, బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లు, విమానాశ్రయాలు, మేళాలు, బజార్‌లు, పర్యాటక ప్రదేశాలలో 1140 మొబైల్ బూత్‌లను ఏర్పాటు చేయడం జరిగిందని మంత్రి తెలిపారు. 5ఏళ్ల లోపు పిల్లలందరికీ 5 డోస్‌ల పోలియో చుక్కల్ని వేస్తున్నట్లు చెప్పారు. పల్స్ పోలియో రోజున చిన్నారులకు వేసే రెండు చుక్కలు వారి నిండు జీవితానికి ఎంతో మేలు చేస్తాయని అన్నారు. బూత్ స్థాయిలో ఎఎన్ఎం, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, స్టాఫ్ నర్సుల బృందం పిల్లలకు పోలియో చుక్కల్ని వేస్తారని, ఆదివారం 1704 మంది మెడికల్ అధికారులు, 39,494 మంది ఇతర ఫార్మసిస్టులు, నర్సింగ్ విద్యార్థులు, ఇతర సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఉపాధ్యాయులు, 4206 మంది పర్యవేక్షకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని తెలిపారు పలు కారణాలవల్ల పోలియో చుక్కలు వేసుకోలేకపోయిన పిల్లలకు తిరిగి ఈ నెల 23, 24 తేదీలలో సంచార జాతులు నివసించే ప్రాంతాలు, నిర్మాణ స్థలాలు, ఇటుక క్షేత్రాలు, ఇతర వలస ప్రాంతాలు కవర్ చేయడానికి 1854 మొబైల్ బృందాలు పర్యటించి పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని మంత్రి తెలిపారు. తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించేందుకు తల్లిదండ్రులు ముందుకొచ్చి ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జిల్లాలో ఐదు సంవత్సరాలలోపు 1,94,437 మంది గుర్తించడం జరిగిందని, వారికి పోలియో చుక్కలు వేసేందుకు 1332 బూతులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం డిసిహెచ్ఎస్ లావణ్యకుమారి, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎన్‌వివి.సత్యనారాయణ, రెడ్ క్రాస్ సంస్థ ఛైర్మన్ వైడి.రామారావు, వివిధ పార్టీల నాయకులు, డాక్టర్లు, వైద్య సిబ్బంది, పాల్గొన్నారు. **సామర్లకోట** స్థానిక బ్రౌన్‌పేట సెంటర్ అంబేద్కర్ పార్కులో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, మున్సిపల్ కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య, ఎంసి ఛైర్‌పర్సన్ అందుగుల మణికుమారి, నాయకులు బడుగు శ్రీకాంత్, కంటే జగదీష్ మోహన్, అడబాల కుమారస్వామి, పిట్టా జానకిరామారావు, అందుగుల జార్జి చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు. అలాగే హుస్సేన్‌పురంలో మార్ని రమణ చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. పనసపాడు గ్రామంలో గ్రామ సర్పంచ్ చీకట్ల వెంకటేష్ ఆధ్వర్యంలో పల్స్ పోలియో కార్యక్రమం జరిగింది. **యు.కొత్తపల్లి** మండలంలోని వాకతిప్ప గ్రామంలో పల్స్ పోలియా కార్యక్రమం ప్రారంభం అయింది. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గుండ అప్పారావు, పేనుబోతుల వీరబాబు, మామిడి మల్లిబాబు, పిల్లి సత్యనారాయణ, గుబ్బల కాశి, జ్యోతుల శివ, మేడిశెట్టి దుర్గా, రాజేష్, పిల్లి శ్రీను, ప్రసాద్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు. **జగ్గంపేట** మండలంలో 64 పోలియో కేంద్రాల ద్వారా చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ, రాజుపూడిలో టిడిపి జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. **కాకినాడ రూరల్** మండలంలోని చీడిగ, ఇంద్రపాలెం, గంగనాపల్లి, స్వామి నగర్ వంటి ప్రాంతాల్లో పోలియో చుక్కల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో టిడిపి నాయకులు నులుకుర్తి వెంకటేశ్వరరావు, కొండా వినాయక్, శ్రీరాములు గవర, సూరంపూడి రాజు, దమ్ము నూకరాజు, కర్రి శంకర్ పాల్గొన్నారు. **గండేపల్లి** మండలంలో చేపట్టిన పల్స్ పోలియో కార్యక్రమంలో 96 పల్స్ పోలియో పూర్తియిందని వైద్యాధికారి నరేష్ తెలిపారు. పలు గ్రామాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ హరికృష్ణసత్యారెడ్డి, సర్పంచులు పాల్గొన్నారు. **గొల్లప్రోలు** పట్టణ, మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించారు. పిహెచ్‌సి డాక్టర్ సునీత మెర్సి, కీర్తన ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. **ప్రత్తిపాడు** మండలంలోని పెద శంకర్లపూడిలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలను వేశారు. ఈ కార్యక్రమంలో పెద్దిపాలెం పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ యశస్వి, నాయకులు వరుపుల రామకృష్ణ, ఇళ్ల అప్పారావు, జువ్విన తిరుపతి రావు, చీకట్ల నాని, లొండ వెంకటేష్ పాల్గొన్నారు. **తాళ్లరేవు** మండలంలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో 96 శాతం పూర్తియిందని గాడిమొగ వైద్యురాలు జయభార్గవి తెలిపారు. మండలంలోని పలు గ్రామాలతోపాటు, మండల పరిధిలో ఉన్న హోప్ ఐలాండ్‌లోనూ పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. **పెద్దాపురం** పట్టణ, మండల పరిధిలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో వైద్య ఆరోగ్యశాఖ డివిజనల్ ఆఫీసర్ డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ శ్రావణి, డాక్టర్ దీపిక, డాక్టర్ ప్రభాకర్, ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల రాజకీయ నాయకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. **రౌతులపూడి** మండలంలోని పలు గ్రామాల్లో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని నిర్వహించారు. రౌతులపూడిలో మాజీ ఎంపిపి భాస్కర్ బాబు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.



జగ్గంపేటలో పోలియో చుక్కలు వేస్తున్న ఎంఎల్ఎ నెహ్రూ



ప్రత్తిపాడులో పోలియో చుక్కలు వేస్తున్న ఎంఎల్ఎ సత్యప్రభ

సామర్లకోటలో పోలియో చుక్కలు వేస్తున్న ఎంఎల్ఎ చినరాజప్ప

కార్టూ'నిజం'



పంచాయతీల పునర్విభజనపై కసరత్తు

ప్రజాశక్తి - తాళ్లరేవు

పంచాయతీల పునర్విభజనపై ప్రభుత్వం ఆలోచన చేయడంతో మండలంలోని 2 గ్రామపంచాయతీల పునర్విభజనపై నాయకులు కసరత్తు ప్రారంభించారు. ప్రధానంగా కోరంగి, పటవల పంచాయతీలను విభజించాలని భావిస్తున్నట్లు సమాచారం. కోరంగి పంచాయతీ భౌగోళికంగా 5 ప్రాంతాలుగా విడిపోయి ఉండడంతో పరిపాలన సౌలభ్యం ఉండటం లేదనే అభిప్రాయం ఉంది. అలాగే సామాజిక వర్గ సమీకరణల నేపథ్యంలో రాజకీయాలు ఉండడంతో విభజన అనివార్యంగా కనబడుతుంది. ఇక్కడ మిగిలిన సామాజిక వర్గాలకు ధీటుగా అగ్నికుల క్షత్రియ సామాజిక వర్గం ఉంది. దీంతో చిన్నబొడ్డు వెంకటాయపాలెం, పెద్ద బొడ్డు వెంకటాయపాలెం ఒక్కటైతే గెలుపు నల్లేరు మీద నడకలా ఉంటుంది. ఆ గ్రామాల్లో ఇద్దరు బలమైన అభ్యర్థులు పోటీ పడటం లేదా, రిజర్వుడు అయితే తప్ప ఆ గ్రామపంచాయతీ సర్పంచ్ పదవి ఆ గ్రామాల నుంచి బయటకు రాని పరిస్థితి ఏర్పడింది. దీంతో గ్రామపంచాయతీలో మిగిలిన గ్రామాల్లో మెజారిటీగా ఉండే ప్రజలకు ప్రాతినిధ్యం ఉండడం లేదు. ఈ నేపథ్యంలో పంచాయతీకి విడగొట్టడం ద్వారా ఈ సమస్యను పరిష్కరించాలని నాయకులు భావిస్తున్నారు. దానికోసం ఇటీవల జరిగిన సమావేశాలలో మూడు పంచాయతీలుగా విడగొట్టాలని అభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది. అందులో కొందరు రెండుగా మాత్రమే విభజించాలని అభిప్రాయం వ్యక్తం చేసినట్లు సమాచారం. పటవల పంచాయతీనిరెండు పంచాయతీలుగా పునర్విభజన చేయాలని భావిస్తున్నారు. దీనికోసం ఇప్పటికే సమావేశాలు జరిపి సమాలోచనలు చేశారు. దీనికి కొన్ని వర్గాల నాయకులు వ్యతిరేకిస్తున్నట్లు తెలిసింది. పటవల పంచాయతీలో రామన్నపాలెం, కొత్తూరు గ్రామాలు ఒకటిగా చేయాలని మత్స్యకార సామాజిక వర్గం, నాయకులు భావిస్తున్నారు. పటవల శివారు ప్రాంతమైన శాంతిమూల గ్రామాన్ని దేనిలో కలపాలనే సందేహం కలుగుతోంది. శనివారం రెండు పంచాయతీలో పరిధిలో సమావేశాలు నిర్వహించి ఆయా నాయకుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఏది ఏమైనా మరో రెండు మూడు రోజుల్లో కోరంగి, పటవల రెండు పంచాయతీల విభజన జరిగితే పరిపాలన సౌలభ్యం తో పాటు కొన్ని సామాజిక వర్గాలు సునాయాసంగా ఆయా ప్రాంతాల్లో విజయం సాధించవచ్చని భావిస్తున్నారు.

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న లీగల్ ఇన్‌స్పెక్టర్ బాలాజీ

వినియోగదారుల సమస్యలపై సదస్సు

ప్రజాశక్తి - పెద్దాపురం

జాతీయ వినియోగదారుల వారోత్సవాల్లో భాగంగా ఆదివారం లీగల్ మెట్రాలజీ , వినియోగదారుల సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో కిరాణా, వెండి, బంగారు వర్తకులు, కొనుగోలుదారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ బాలాజీ మాట్లాడుతూ ప్రతి వ్యాపారస్తుడు వినియోగదారులకు ఎటువంటి నష్టం కలుగకుండా వినియోగదారుల హక్కుల నియమ నిబంధనలు పాటించాలన్నారు. తూనికలు కొలతల్లో ఎటువంటి తేడాలు రాకూడదని, వినియోగదారులను ఎటువంటి మోసాలకు గురి చేయరాదని, ప్రతి దానికి బిల్లు ఇవ్వాలని, బంగారు వర్తకులు హాల్ మార్క్ ఉన్న వస్తువులనే అమ్మాలని, బంగారు వస్తువులకు బిల్లు విడిగా ఇవ్వాలని అన్నారు. వినియోగదారుల సంఘం అధ్యక్షులు, విజిలెన్స్ కమిటీ సభ్యులు బి.సూర్యనారాయణమూర్తి మాట్లాడుతూ వినియోగదారులు మోసపోతే జిల్లా వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వినియోగదారుల సంఘ సభ్యులు ఎం.భాస్కరరావు, వి.శ్యామల, కెవివి.లక్ష్మి, వ్యాపారులు, వినియోగదారులు పాల్గొన్నారు.

సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని కాట్రావులపల్లి గ్రామంలో రూ.1.60 కోట్లతో నిర్మించే సిసి రోడ్డు నిర్మాణానికి ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూకిలో మీటర్ మేర వేసే ఈ రోడ్డును వెడల్పు చేసి నిర్మించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ముసిరెడ్డి నాగేశ్వరరావు, అర్ అండ్ బి ఎఇ సాయికిరణ్ పాల్గొన్నారు.

నవీన్‌కు ఘన సత్కారం

ప్రజాశక్తి - గండేపల్లి

నవీన్‌ను సత్కరిస్తున్న పరిమి బాబు

టిడిపి జిల్లా అధ్యక్షునిగా రెండో దఫా ఎన్నికైన జ్యోతుల నవీన్‌ను జడ్‌పిటిసి పరిమి బాబు ఘనంగా సత్కరించారు. ఆదివారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయనను పరిమి బాబు ఆధ్వర్యంలో మండల తెలుగు యువత అధ్యక్షులు సుంకవల్లి రమేష్ సారంగదరుడు కలిసి పూలమాలలతో సత్కరించారు.

24న క్రాస్ కంట్రీ ఛాంపియన్‌షిప్ పోటీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

జిల్లా అథలటిక్‌స అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 24న స్థానిక లూథరన్ హైస్కూల్ గ్రౌండ్‌లో రాష్ట్ర స్థాయి క్రాస్ కంట్రీ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షులు టివిఎస్.రంగారావు, జనరల్ సెక్రటరీ కె.సుబ్రహ్మణ్యాం, కోశాధికారి ఎస్‌విబిఎల్‌జి.వర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు జార్ఖండ్ రాష్ట్రంలో జనవరిలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

నేరాలు ఘోరాలు

కొట్లాటపై కేసు నమోదు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలో ఇరువర్గాల మధ్య జరిగిన కొట్లాటపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఉత్తరప్రదేశ్‌కు చెందిన దుర్గాదాస్ అతని అనుచరులు మండలంలోని ఎకె.మల్లవరం గ్రామంలో వరి కోత మిషన్‌పై పనిచేయటానికి వచ్చి నివాసం ఉంటున్నారు. గత రాత్రి శనివారం దుర్గాదాస్, అతని అనుచరులు కెనాల్ పక్కన రేకుల షెడ్డులో ఉంటున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన ధీరజ్, అతని అనుచరులుపై కర్రాలు, ఇనుప రాడ్లతో దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో ఆరుగురుకి గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ ఎస్.రామకృష్ణ పరిశీలించారు. ఇరు వర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చొల్లంగి పేటలో తనిఖీలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని చొల్లంగిపేట పంచాయతీ కొబ్బరి చెట్టుపేటలో కాకినాడ రూరల్ సిఐ చైతన్యకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం తనిఖీలు చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి అపరిచితుల సంచారం, వాహనాల రికార్డులను పరిశీలించారు. క్రొత్త, అనుమానాస్పద వ్యక్తుల వివరాలు అడిగి నమోదు చేసి, కాలనీ ప్రజలకు అనుమానిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ తనిఖీలలో రికార్డు లేని 11 మోటార్ సైకిల్స్‌ను గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ తెలిపారు. ఈ తనిఖీల్లో వివిధ పోలీస్‌స్టేషన్ల ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

చోరీ కేసుల్లో నిందితుల అరెస్ట్

ప్రజాశక్తి - అమలాపురం

చోరీల పాల్పడిన ముగ్గురు నిందితులను వేర్వేరు చోట్ల పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. వివరాలను ఎస్పి రాహుల్ మీనా ఆదివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలోవివరాలను వెల్లడించారు. అమలాపురం టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న గృహదోపిడీ కేసును పోలీసులు ఛేదించారు. ఒంటరి మహిళ ఇంట్లో బంగారు, వెండి ఆభరణాలు చోరీ చేసిన కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి సుమారు రూ.25లక్షల విలువైన ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. చల్లావారి వీధి, భూపయ్య అగ్రహారం, అమలాపురం నివాసి టాటా ఉషా రమణి గత మే నెలలో కుమార్తెల వద్దకు హైదరాబాద్ వెళ్లింది. ఆమె ఇంట్లో దొంగతనం జరిగినట్లు పొరుగువారు తెలియజేశారు. ఇంటిని పరిశీలించగా బంగారు, వెండి ఆభరణాలు చోరీ అయ్యాయని గుర్తించారు. ఈ మేరకు అమలాపురం టౌన్ పిఎస్‌లో కేసు నమోదు చేశారు. ఈ కేసులో పోలీసులు కొంకాపల్లి గ్రామానికి చెందిన పతివాడ లోవరాజును అమలాపురం చిందాడగరువు బైపాస్ రోడ్ వద్ద శనివారం అరెస్ట్ చేశారు. రాత్రివేళ ఇళ్ల తాళాలను, గేట్లు, ఇనుప సేఫ్‌లను ఇనుపరాడ్, స్క్రూడ్రైవర్‌తో పగలకొట్టి నిందితుడు చోరీలకు పాల్పడేవాడు. అతడు గతంలో ఎపి, తెలంగాణ రాష్ట్రాల్లో 70కి పైగా చోరీ కేసుల్లో పాల్గొన్నట్లు తెలిపారు. నిందితుడి వద్ద నుంచి ఒక బైక్‌తో పాటు 185 గ్రాముల బంగారు ఆభరణాలు, 1750 గ్రాముల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ రూ.25 లక్షలుగా అంచనా వేశారు. ఆత్రేయపురం పిఎస్ పరిధిలో జరిగిన చోరీ కేసులో కావూరు మూర్తిని శనివారం భీమవరం వద్ద అరెస్ట్ చేశారు. ఇతని వద్ద రూ.6 లక్షల విలువైన 49.8 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కొత్తపేట బ్యాంకు కాలనీలో తాళం వేసిన ఇంట్లోకి చొరబడి చోరీ పాల్పడిన నిందితుడిని కొత్తపేటలో పోలీసులు అరెస్ట్ చేశారు. అంబాజీపేట మండలం పుల్లేరుకుర్రును గంటి గౌతమ్ అరెస్టు చేసి అతని వద్ద నుంచి రూ.4.5 లక్షల విలువగల 39 గ్రాముల బంగారం. స్వాధీనం చేసుకున్నారు.ఈ కేసులను అమలాపురం పట్టణ సిఐ పి.వీరబాబు ఆధ్వర్యంలో సిసిఎస్ అమలాపురం బృందం సమన్వయంతో ఛేదించినట్లు పోలీసులు తెలిపారు. ఈ దర్యాప్తులో ఇన్‌స్పెక్టర్ గజేంద్రకుమార్, ఎస్ఐ ఎ.పరదేశి, ఎఎస్ఐ ఎ.బాలకృష్ణ, హెడ్ కానిస్టేబుళ్లు రాజు, రమణ, కానిస్టేబుళ్లు శ్రీను, సాయి, బి.ప్రసాద్, జి.ప్రసాద్, హరి, సుభాకర్, అర్జున్‌లను ఎస్పి అభినందించారు. వారికి రివార్డులను ప్రకటించారు.

వరకట్న వేధింపులపై ఫిర్యాదు

ప్రజాశక్తి - రామచంద్రపురం

వరకట్నం వేధింపులపై వివాహితురాలు ఫిర్యాదు మేరకు ఆదివారం ద్రాక్షారామం పోలీసులకు కేసు నమోదుచేశారు. వివరాలు ఇవి. ద్రాక్షారామంకు చెందిన పెయ్యిల శిరీష తిరణంపేటకు చెందిన సత్యహర్షను 2024లో అన్నవరంలో కులాంతర వివాహం చేసుకుంది. వీరి ఒక పాప ఉంది. కొద్దికాలం తరువాత తన భర్త వరకట్నం కోసం వేధిస్తున్నాడని శిరీష చెప్పింది. తన మరిది, ఆడపడుచు తన భర్తకు ఇంకో వివాహం చేస్తామని చెబుతున్నారని, తనను దుర్భాషలాడుతూ ఇంట నుంచి గెంటివేశారని శిరీష తెలిపింది. మా అమ్మ ఇంటి వద్ద పెద్దల్లో సమక్షంలో మాట్లాడిన తరువాత నవంబర్ 23 నా భర్త ఇంటికి తిరణంపేట కాపురానికి వెళ్లానని బాధితురాలు తెలిపింది. అయితే అదే రోజు రాత్రి నా భర్త, మరిది, ఆడపడుచు నన్ను దుర్భాషలాడుతూ అదనపు ట్నం తెస్తేనే కాపురం చేస్తావని, లేకపోతే వెళ్లి పొమ్మన్నారని తెలిపింది. తన భర్త, మరిది, ఆడపడుచులపై పోలీసులకు ఫిర్యాదు చేసింది దీనిపై ద్రాక్షారామ ఎస్ఐ ఎం.లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా జర్నలిస్టుల వన సమారాధన

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

జిల్లా జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండలంలోని కొవ్వాడ తోటల్లో వన సమారాధన కార్యక్రమం ఆదివారం జరిగింది. వివిధ ఆటలు పాటలతో జర్నలిస్టులు ఉత్సాహంగా గడిపారు. అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు మంగా వెంకట శివరామకృష్ణ, డెంకాడ మోహన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ పంతం నానాజీ, ఎంఎల్‌సి పేరాబత్తుల రాజశేఖరం, మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, టిడిపి నియోజకవర్గ కో-ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. నిత్యం పని ఒత్తిడితో ఉండే జర్నలిస్టులకు ఇటువంటి ఆటవిడుపు కార్యక్రమాలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. ప్రభుత్వం నుంచి సహకారం అందిస్తామన్నారు. అనంతరం అతిధులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ సిటి, రూరల్ విలేకరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలను సాధించడమే లక్ష్యం

ప్రజాశక్తి ముఖాముఖీలో జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ఈ ఏడాది నిర్వహించబోయే 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో కాకినాడ జిల్లా ఉత్తమ ఫలితాలను సాధించేందుకు కృషి చేస్తున్నామని జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్ అన్నారు. జిల్లాలో సుమారు 400 వరకూ హైస్కూల్స్ ఉండగా వీటిలో 256 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. మొత్తం వాటిలో 28,329 మంది విద్యార్థులు 10వ తరగతి చదువుతున్నారు. ఈ నేపథ్యంలో 10వ తరగతిలో నూటికి నూరు శాతం ఫలితాలు సాధించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని డిఇఒ ప్రజాశక్తి ముఖాముఖీలో వివరించారు.

ఎటువంటి లక్ష్యాన్ని పెట్టుకున్నారు ?

టెన్త్ పరీక్షల సమయం దగ్గర పడుతోంది. ఈ నేపథ్యంలో పదో తరగతిలో రాష్ట్రంలోనే టాప్ 5 స్థానాల్లో చోటు దక్కించుకునే లక్ష్యాన్ని తీసుకున్నాం. గతంలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన సందర్భాలున్నాయి. ఈసారి టాప్‌లో నిలపాలనేది ఈ విద్యాసంవత్సరంలో లక్ష్యంగా పెట్టుకున్నాం.

ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు ?

జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి పర్యవేక్షణలో జిల్లా విద్యా శాఖ ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేసింది. దీనిని ఇప్పటికే కొన్ని విభాగాల్లో అమలు చేస్తున్నాం. వంద రోజుల కార్యాచరణను సిద్ధం చేసి అమలు చేస్తున్నాం. నూరు శాతం ఫలితాలు సాధించే దిశగా బోధనా సిబ్బందిని సమాయత్తం చేశాం. ప్రత్యేకంగా రోజువారీ బోధన పద్ధతులు, విద్యార్థుల హాజరు తదితర అంశాలపై అనుసరించాల్సిన విధివిధానాలను ఇప్పటికే ప్రధానోపాధ్యాయులకు జారీ చేశాము. ఇప్పటికే ఆయా సబ్జెక్టుల సిలబస్‌ను పూర్తి చేయడం జరిగింది. సి, డి గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధను కనబరిచి పరీక్షలకు సిద్ధం చేస్తున్నాం.

ఎటువంటి ప్రణాళికను అమలు చేస్తున్నారు ?

వచ్చే ఏడాది మార్చి 16 నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. గత ఏడాది జిల్లాలో 27,368 మంది పరీక్ష రాయగా, 22,508 మంది ఉత్తీర్ణత సాధించారు. 82.24 శాతంతో రాష్ట్రంలో 15వ స్థానంలో నిలిచాం. ఈ ఏడాది 104 కేంద్రాల్లో 28,329 మంది పరీక్షలు రాస్తారు. గతేడాది కంటే ఈసారి ఇంకా మెరుగైన ఫలితాలను సాధించాలనేది లక్ష్యంగా పెట్టుకున్నాం. డిసెంబరు నుంచి వంద రోజుల ప్రణాళిక పేరుతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం.

ఎలా అమలు చేస్తున్నారు ?

ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకూ, అలాగే మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు సబ్జెక్టుల వారీగా పునశ్చరణ తరగతులు నిర్వహిస్తున్నాం. ఆఖరి పిరియడ్లో సాయంత్రం 4 గంటల నుంచి 5 వరకు 20 మార్కులకు పరీక్షను నిర్వహించి, వెంటనే మూల్యాంకనం చేస్తున్నాం. వచ్చిన మార్కులను లీప్ యాప్లో నమోదు చేస్తున్నారు. వాటిని తల్లిదండ్రులు సైతం పరిశీలించుకోవచ్చు. వాటి ఆధారంగా విద్యార్థి సామర్థ్యాన్ని అంచనా వేస్తున్నాం. మరింతగా రాణించేలా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో 100 రోజులు ప్రణాళికను పక్కాగా అమలు చేస్తున్నాం. ప్రధానంగా సి, డి గ్రేడు విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెడుతున్నాం. రోజువారీ, వారాంతపు, నెలవారీల ద్వారా వారి సామర్థ్యాలను అంచనా వేసి మెరుగుపరిచేలా చర్యలు చేపడుతున్నాం.

ప్రత్యేక తరగతులు ఎలా జరుగుతున్నాయి ?

వంద రోజుల ప్రణాళికలో భాగంగా ప్రతి రోజూ ఉదయం 8 నుంచి 9 గంటల వరకూ రెమిడియల్ క్లాసులు నిర్వహిస్తున్నాం. తరువాత 9.15 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ నాలుగు సబ్జెక్టులు బోధిస్తున్నాం. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకూ ప్రతి రోజూ ఒక సబ్జెక్టులో పరీక్ష నిర్వహిస్తున్నాం. ఆ పరీక్షలో వచ్చిన మార్కులను ఆన్‌లైన్ చేసి, ఆ మార్కులపై మరుసటి రోజు పునశ్చరణ తరగతులను నిర్వహిస్తున్నాం. శని, ఆదివారాలు, సెలవు దినాల్లో సైతం ఈ ప్రణాళిక అమలవుతుంది. జనవరిలో కేవలం భోగి, సంక్రాంతి, కనుమ పండగలు మూడు రోజులూ మినహా మిగిలిన అన్ని రోజులూ ఈ ప్రణాళిక యథాతథంగా అమలు చేస్తాం. విద్యార్థులు ఏయే సబ్జెక్టుల్లో వెనుకబడి ఉన్నారో గుర్తించి, వారిలో భయాన్ని పోగొట్టి, ఆత్మవిశ్వాసం నింపేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు.

ఘనంగా వైఎస్.జగన్ పుట్టిన రోజు

మాజీ సిఎం, వైసిపి అధినేత వైఎస్.జగన్మోహన్ రెడ్డి పుట్టిన రోజు వేడుకను ఆ పార్టీ శ్రేణులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహించారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

యు.కొత్తపల్లి మండలంలోని వాకతిప్పలో ఉన్న వైసిపి కార్యాలయంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి పుట్టిన రోజు వేడుకను నిర్వహించారు. మండల వైసిపి అధ్యక్షుడు ఆనాల సుదర్శన్ ఆధ్వర్యంలో కేక్‌ను కట్ చేశారు. పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు రావు చిన్నారావు, సర్పంచ్ పాలని దొరబాబు, ఎంపిటిసి సభ్యులు రాయుడు విష్ణు, నాయకులు కుక్కల వెంకటరమణ, రాపర్తి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. **రౌతులపూడి** స్థానిక ఆర్‌ఎన్‌ఆర్ కల్యాణ మండపంలో జగన్మోహన్ రెడ్డి పుట్టిన రోజు వేడుకను ఘనంగా నిర్వహించారు. తొలుత మార్కెట్ సెంటర్‌లో ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి వైసిపి నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ గిరి, మాజీ ఎంఎల్‌సి అంగూరి లక్ష్మీశివకుమారి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి జమీలు, జడ్‌పిటిసి గొల్లు లక్ష్మణమూర్తి పూలమాలలు వేశారు. అనంతరం కేక్‌ను కట్ చేసి జగన్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. వృద్ధులకు దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు సత్యనారాయణ, పులి మధు, సర్నం శ్రీను, గొల్లు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. **జగ్గంపేట** మండలంలో జగన్ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. వైసిపి నాయకులు ఒమ్మి రఘురామ్, జడ్‌పిటిసి బిందుమాధవి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. నియోజకవర్గ సమన్వయకర్త తోట నరసింహం ఆధ్వర్యంలో రక్తదానం నిర్వహించి ఆసుపత్రిలోని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. మాజీ ఎంఎల్ఎ జ్యోతుల చంటిబాబు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పేదలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తోట రాంజీ, బండారు రాజా, రావుల గణేష్‌రాజా తదితరులు పాల్గొన్నారు. **సామర్లకోట** స్థానిక అన్నపూర్ణ కల్యాణ మండపంలో జగన్ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ దవులూరి దొరబాబు ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చేశారు. పలువురు వైసిపి నాయకులు రక్తదానం చేశారు. కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్లు నెక్కంటి సాయిప్రసాద్, ఊబా జాన్ మోజెస్, నాయకులు దవులూరి సుబ్బారావు, పాగా సురేష్‌కుమార్, ఆవాల లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు. **గొల్లప్రోలు** పట్టణంలో వైసిపి జిల్లా కార్యదర్శి అంజూరి రాంబాబు ఆర్థిక సాయంతో నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వంగ గీత పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి ఆకుల శ్రీను, వైసిపి నాయకులు గండ్రేటి శ్రీరామచంద్రమూర్తి, జ్యోతుల భీముడు, తదితరులు పాల్గొన్నారు. **తాళ్లరేవు** స్థానిక చెరువు గట్టు, సంతపేట సెంటర్లలో జగన్ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక సిహెచ్‌సిలో రోగులకు రొట్టెలు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి చింతలపాటి శ్రీనివాసరాజు పాల్గొని కేక్ కట్ చేశారు. అలాగే నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ పందిరిపల్లి రాజేష్ ఆధ్వర్యంలో నీలపల్లిలో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పందిరిపల్లి అమర్‌కుమార్, నాయకులు రేవు మల్లేశ్వరి, రెడ్డి సతీష్, తదితరులు పాల్గొన్నారు. **కోటనందూరు** తుని, ఎస్.అన్నవరం ప్రాంతాల్లో జగన్ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో వైసిపి జిల్లా అధ్యక్షులు దాడిశెట్టి రాజా పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమాల్లో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **ప్రత్తిపాడు** మండలంలోని ఒమ్మంగి గ్రామంలో మండల కన్వీనర్ రామిశెట్టి నాని ఆధ్వర్యంలో సర్పంచ్ తుమ్మల భవాని అధ్యక్షతన జగన్ పుట్టిన రోజు వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కో-ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పాల్గొని పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొప్పన గంగారావు, సాధనాల అప్పారావు,కొప్పన వెంకన్నబాబు, తదితరులు పాల్గొన్నారు.

కోటనందూరులో మాట్లాడుతున్న దాడిశెట్టి రాజా

గొల్లప్రోలులో దుప్పట్లు పంపిణీచేస్తున్న వంగా గీత

సామర్లకోటలో రక్తదానం చేస్తున్న వైసిపి శ్రేణులు

వాజ్‌పేయ్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - కాకినాడ

మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయ్ విగ్రహ ఆవిష్కరణ నగరంలోని మూడు లైట్ల జంక్షన్ కొళాయి చెరువు ప్రాంగణంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాజపేయి జీవిత విశేషాలను నాయకులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సిలు కరి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖర్, రాష్ట్ర పౌర సరఫరా ఛైర్మన్ తోట సుధీర్, ఎంఎల్‌ఎలు వనమాడి కొండబాబు, పంతం నానాజీ, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, జ్యోతుల నెహ్రూ, వరుపుల సత్య ప్రభ, టిడిపి జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్‌కుమార్, జనసేన జిల్లా అధ్యక్షులు తుమ్మల బాబు, తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

వికలాంగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని టిడిపి జిల్లా నాయకుడు బొదిరెడ్డి గోపి అన్నారు. స్థానిక క్వారీ ఏరియాలో ఆదివారం వికలాంగులకు రగ్గులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగుల పింఛన్‌ను రూ.3 వేల నుంచి రూ.6 వేలకు పంపిణీ చేసి వారిని ఆదుకుంటుందన్నారు. వికలాంగుల పోరాట సమితి నాయకుడు కె.సుధాకర్ మాట్లాడుతూ దివ్యాంగుల మనోస్థైర్యాన్ని కోల్పోవద్దని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు మూది నారాయణస్వామి, ఎండ గుండె నాగబాబు, రాయుడు చిన్న, వికలాంగుల సంఘం నాయకులు అంబటి రాజకుమారి, బొస్సా యేసు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు రగ్గుల పంపిణీ

ప్రజాశక్తి - పిఠాపురం

స్థానిక ఇందిరానగర్‌లో లిటిల్ స్టార్స్ రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వృద్ధులకు రగ్గుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ కన్వీనర్ టి.కరుణ్‌రాజు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం చలికాలంలో వృద్ధులు, పేదల కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈసారి చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఇందిరానగర్‌లో నివసిస్తున్న వృద్ధులకు ప్రాధాన్యతనిస్తూ రగ్గులు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ట్రెజరర్ టి.షాలేమ్‌రాజు, ట్రస్ట్ డైరెక్టర్ టి.బ్యూలాగ్రేస్, సిహెచ్.అన్నమణి, సిహెచ్.గ్రేస్ పాల్గొన్నారు.

శ్మశాన వాటిక అభివృద్ధికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

మండలంలోని చిన్న శంకర్లపూడి గ్రామంలోని సగర్ల శ్మశాన వాటిక అభివృద్ధికి గ్రామానికి చెందిన గజ్జల చిన్నవెంకన్న బిసి ఐక్య సంఘర్షణ సమితి నియోజకవర్గ కన్వీనర్ ఏపూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో రూ.50వేల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా స్మశాన వాటిక అభివృద్ధి కోసం విరాళాన్ని అందించిన వెంకన్నను ఏపూరి శ్రీను అభినందించారు. ఈ కార్యక్రమంలో చనిబోయిన నాగేశ్వరరావు, ఏపూరి రాంబాబు, తంగెళ్ల నాగరాజు, బద్దేటి అప్పారావు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించడం తప్పనిసరి

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం తప్పనసరి అని సిఐ శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ఉప్పాడ బీచ్ రోడ్డులో ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధరించడంపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలు, ప్రాణరక్షణలో హెల్మెట్ పాత్ర, అలాగే ట్రాఫిక్ నిబంధనలు, సేఫ్ డ్రైవింగ్, రోడ్డు ప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాల్లో తలకు గాయాలు కావడం వల్లనే ఎక్కువమంది ప్రాణాలు కోల్పోతున్నారని, అందువల్ల ప్రతి ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కోరారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని, కాబట్టి డ్రంక్ అండ్ డ్రైవ్ చేయరాదరన్నారు.

నేడు పాలకవర్గం ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మహారాణి సత్రం నూతన పాలకవర్గం సోమవారం ప్రమాణ స్వీకారం చేయనుందని ఆర్యవైశ్య సేవా సంఘం సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మట్టే ఆదినారాయణ, నాగమణి ఆర్యవైశ్య సేవా సంఘ భవనంలో జరిగే కార్యక్రమంలో ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, ఎంపి తంగేళ్ల ఉదయ శ్రీనివాస్, డిసిసిబి ఛైర్మన్ తుమ్మల బాబు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు, నాయకులు బిక్కిన విశ్వేశ్వరరావు, నిమ్మకాయల రంగనాగ్ పాల్గొంటారని తెలిపారు.

క్రిస్మస్ కేక్‌ను కట్ చేస్తున్న పాస్టర్లు, ఆసుపత్రి ప్రతినిధులు

మెడికవర్‌లో ఘనంగా క్రిస్మస్ వేడుక

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

మెడికవర్ హాస్పిటల్స్‌లో ఆదివారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెవ. డాక్టర్ జోసెఫ్ బెన్నీ పాల్గొని క్రిస్మస్ పండుగ ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి ఒక్కరూ యేసు బోధనలను తమ జీవితాల్లో ఆచరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్స్ సెంటర్ హెడ్ శుభాకరరావు మాట్లాడుతూ క్రిస్మస్ పండుగ సమాజంలో మానవీయ విలువలను పెంపొందించే పండుగ అని కొనియాడారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్టింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు, నర్సులు, పారామెడికల్ స్టాఫ్, సపోర్టివ్ స్టాఫ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి విభాగాధిపతులు, సీనియర్ డాక్టర్లు, నర్సింగ్ సూపర్‌వైజర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రంగా విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - పిఠాపురం

స్థానిక జగ్గయ్య చెరువు కాలనిలో కో-ఆపరేటివ్ సొసైటీ అర్బన్ బ్యాంక్ మాజీ ఛైర్మన్ బాలపల్లి రాంబాబు అధ్యక్షతన వంగవీటి మోహన రంగా విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి కార్పొరేషన్ డైరెక్టర్ దానం లాజర్‌బాబు, సగర కార్పొరేషన్ డైరెక్టర్ మొగలి అప్పారావు పాల్గొని మాట్లాడారు. ఈ నెల 26న జరిగే రంగా వర్ధంతిని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు బాలపల్లి రాంబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్లు, స్థానిక ప్రజలు, యువకులు పాల్గొన్నారు.

సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - పెద్దాపురం

ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి విడుదలైన చెక్కులను ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు, నిమ్మకాయల రంగనాగ్, మహమ్మద్ ఆరిఫ్ ఆలీ, తదితరులు పాల్గొన్నారు.

జయ నర్సింగ్ హోమ్‌లో భవనం ప్రారంభం

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక జయ నర్సింగ్ హోంలో అదనపు భవనాన్ని ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ ఆదివారం ప్రారంభించారు. ఆసుపత్రి వైద్యులు బివి.రమేష్ ఆధ్వర్యంలో అత్యాధునిక సదుపాయాలతో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, వైసిపి రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురామ్, నాయకులు ఎస్‌వీఎస్.అప్పలరాజు, మారిశెట్టి భద్రం, తదితర నాయకులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, SOLLETI BHAGYALAKSHMI alias NERELLA BHAGYA LAKSHMI W/o NERELLA VENKATESWARLU Aged 41 Years Resident of Address: D.NO. 27-5-21,Buddhavarapu Vari Veedhi, Pedda Masjid Center, Kakinada. Do here by declered that I have changed my name From NERELLA BHAGYALAKSHMI(Old Name) to SOLLETI BHAGYA LAKSHMI (New Name) Hance here after all my documents records and correspondence will be Contined with my new name SOLLETI BHAGYA LAKSHMI For all Purpose vide affidivit Dt. 10.12.2025.

CHANGE OF MY NAME

My Old Name is Kanuboyina Dhanalakshmi. My New name and Changed Name is DHANALAKSHMI KANUBOYINA since today onwards Iam being called as DHANALAKSHMI KANUBOYINA

DHANALAKSHMI KANUBOYINA
D.No.59-5-22, Old Post Office Street, P&T Colony,
Rajamahendravaram-533105
E.G.Dt. Cell.9703732333

మహారాజశ్రీ అనపర్తి సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No.31/2025

Between:-
కర్రి సత్యనారాయణ రెడ్డి ...వాది
మరియు
అంసూరి శ్రీను మరియు వగైరాలు ...ప్రతివాదులు
2వ ప్రతివాది:- కొప్పిశెట్టి దుర్గాప్రసాద్ S/o. కృష్ణ, హిందు, వయస్సు 42సం॥లు, తాపీపని, రాజశేఖర్‌రెడ్డి స్టాట్యూ దగ్గర, గూడల మాచరరావు ఇల్లు (M.P.T.C) అనపర్తి విలేజ్, అనపర్తి మండలం, తూర్పుగోదావరిజిల్లా.

పై నెంబరు దావా గ్రంథంలో 2వ ప్రతివాది అయిన మీకు మహారాజశ్రీ పై కోర్టువారు ఎన్నిసార్లు సమన్లు పంపినను, తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నందున మహారాజశ్రీ కోర్టువారు మీ హాజరు నిమిత్తం పైన తెలిపిన దావా ది.28-01-2026వ సం॥కు వాయిదా వేసియున్నారు. కావున మీరు సదరు తెలిపిన తేదిన ఉదయం గం॥10.30ని॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరు కావలెను. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించడమవుతుందని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టువారి అనుమతితో)

జి.బుల్లిరెడ్డి
వాది తరపు అడ్వకేట్
అనపర్తి
అనపర్తి
ది.21-12-2025
సెల్.9348049999

ఒరిజినల్ దస్తావేజులు పోయినవి

డాక్టర్.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఆలమూరు మండలం, పినపళ్ళ గ్రామానికి చెందిన వక్కపట్ల వీరవెంకట సత్యనారాయణ S/o. ఆదియ్య అను నేను నాఆస్తి తాలూకు వివరములు గురించి ది.25-12-1991 న ఆలమూరు సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులో ద.నెం.2241/1991 రు గా రిజిష్టర్ అయివున్న డాక్యుమెంట్ మరియు ది.8-8-1990న ఆలమూరు సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులో ద.నెం.1052/1990 రు గా రిజిష్టర్ అయివున్న డాక్యుమెంట్, ఈ రెండింటిని ది.16-12-2025 తేదీన తీసుకొని పినపళ్ళ నుంచి కొత్తూరు సెంటర్‌కి జిరాక్స్ కోసం వెళ్ళే క్రమంలో మార్గమధ్యలో పడిపోయినవి. ఎంత ప్రయత్నించినా అవి దొరకలేదు. దొరికిన వారు క్రింది చిరునామాకు గాని, ఫోన్ నెంబర్‌కు గాని తెలియపరచవలసినదిగా కోరుచున్నాను.

వక్కపట్ల వీరవెంకట సత్యనారాయణ
S/o.ఆదియ్య, డోర్‌నెం.1-72, పినపళ్ళ,
ఆలమూరు మండలం, డాక్టర్.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా
సెల్.9849567313

బహిరంగ నోటీసు
మహారాజశ్రీ బొబ్బిలి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు
ఓ.ఎస్. 9/2016

బెవర సీతారాం ......వాది
మరియు
రెడ్డి గౌరి నాయుడు వగైరాలు ....ప్రతివాది
రాయితి రవి కుమార్, వయస్సు 44 సం॥లు, తండ్రి లేటు రాజారావు, నివాసము : కాంతి విద్యానికేతన్ స్కూలు ఏదురుగా, సర్పవరం, కాకినాడ రూరల్, తూర్పు గోదావరి జిల్లా.

పై నెంబరు దావాలో వాది అయిన బెవర సీతారాం గారు పై నెంబరు దావాలో మహారాజశ్రీ బొబ్బిలి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు లో రెడ్డి గౌరి నాయుడు వగైరాలపై ఓ.ఎస్.9/2016 నెంబరు గల దావాను దాఖలు చేసి తను దావా షెడ్యూల్ దాఖల ఆస్తులకు హక్కు దారుడు నని నిర్ధారణ వగైరా పరిహారములు కోరుతూ దాఖలు చేసి యున్నారు. సదరు దావా షెడ్యూల్ ఐటమ్స్ 1 టు 3 భూమిని మీరు పై నెంబరు దావా పెండింగ్ ఉంటుండగా తెలిసి ప్రతివాదులతో కుమ్మక్కై క్రయచీటి పొందియున్నందున మిమ్ములను 10వ ప్రతివాదిగా దావాలో చెర్చబడి యున్నారు. సదరు దావా తే.08.01.2026ది నాటికి వాయిదా అయి ఉన్నది. కావున పైన పేర్కొన్న దావాలో మీకు వాదన ఉన్న యెడల మీ వ్రాతమూలక స్టేట్మెంట్ వగైరాలు ఉన్న యెడల వాటితో సహ పై వాయిదా తేదిన, సదరు కోర్టులో వ్యక్తిగతముగా గాని లేదా తమ న్యాయవాది ద్వారా గాని హాజరై తమ వాదన మరియు లిఖితములను దాఖలు జేయవలసినదిగా మహారాజశ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది. పై చెప్పబడిన తేదిన హాజరు కాకుండ తప్పి పోయే యెడల మీ పరోక్షమందు పై వాద్యమును విమర్శ చేసి మహారాజశ్రీ కోర్టు వారు తీర్మానించడమగునని కోర్టు వారి ఉత్తర్వులు అనుసరించి ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

ఎమ్. బెనర్జీ,
ఏడ్వోకేట్, బొబ్బిలి,
విజయనగరం జిల్లా,
సెల్ నెం.9440592366.

యానాం వార్తలు

మల్లాడి రచించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

వైఎస్ఆర్ స్మృతి మందిరం ప్రారంభం

ప్రజాశక్తి - యానాం

మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి స్మృతి మందిరాన్ని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఆదివారం ప్రారంభించారు. కృష్ణారావు రాజకీయ అరంగేట్రం చేసి ఆదివారానికి 36 ఏళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా యానాం ప్రాంతానికి వైఎస్ఆర్ చేసిన మేలుకు గుర్తుగా స్మృతి మందిరాన్ని, వైఎస్ఆర్ గోవుల నిలయాన్ని స్థానిక యర్రా గార్డెన్స్‌లో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీలు కెవిపి రామచంద్రరావు, ఉండవల్లి అరుణ్‌కుమార్, ఎంఎం.పల్లంరాజు, విజయ్‌సాయిరెడ్డి, పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఎంఎల్‌ఎలు కొణతాల రామకృష్ణ, పంతం నానాజీ, వైఎస్ఆర్ పర్సనల్ పిఎ సూరీడు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వైఎస్ఆర్ యానాంకు చేసిన మేలును మర్చిపోకుండా కృతజ్ఞతతో ఆయన పేరిట స్మృతి మందిరాన్ని నిర్మించడం అభినందనీయమన్నారు. మల్లాడి కృష్ణారావు యానాంకు వైఎస్ఆర్ చేసిన సేవలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ అభిమానులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

విజయవంతంగా పల్స్ పోలియో

ప్రజాశక్తి - యానాం

యానాంలో పల్స్ పోలియో కార్యక్రమం ఆదివారం విజయవంతమైంది. యానాం ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పరిపాలనాధికారి అంకిత్‌కుమార్ స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పిల్లలకు పోలియో చుక్కలు వేసి ప్రారంభించారు. అనంతరం అయ్యా ప్రాంతాల్లో ఉన్న ఆరోగ్య కేంద్రాల వద్ద పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి డీడీ రవిశంకర్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కనకాల తాతయ్య జయంతి

ప్రజాశక్తి - యానాం

మాజీ ప్రజాప్రతినిధి కనకాల తాతయ్య జయంతిని సమాచార శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఫెర్రిరోడ్డులో ఉన్న ఆయన విగ్రహానికి యానాం పరిపాలనాధికారి అంకిత్ కుమార్, ఎస్పి పునీత్‌రాజ్, సిఐ సుందరం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దాట్ల దేవదనంరాజు, చింతా వెంకట్, హంసాని రామలక్ష్మణుడు, కనకాల తాతయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సోమేశ్వరరావుకు ఉత్తమ అవార్డు

ప్రజాశక్తి - గండేపల్లి

అవార్డుతో సోమేశ్వరరావు

సూరంపాలెంలోని ఆదిత్య విశ్వవిద్యాలయ కార్యాలయాధికారిగా సేవలందిస్తున్న 'శంఖారావం మరియు తెలుసుకుందామా' అంతర్జాల పక్ష పత్రికల సంపాదకుడు గండికోట సోమేశ్వరరావుకు 'ఉత్తమ అంతర్జాల పత్రికా సంపాదకుని అవార్డు లభించింది. హైదరబాద్‌కు చెందిన 'ఇందిరా ఆర్ట్స్ ఫౌండేషన్ సంస్థ సమాజంలో వివిధ రంగాల్లో విశేష సేవలందిస్తున్న వారికి ప్రోత్సహిస్తూ అవార్డులను అందిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది సంపాదకీయం విభాగంలో గండికోట సోమేశ్వరరావుకు ఈ నెల 18న సంస్థ కార్యాలయంలో ఈ అవార్డును అందజేసింది. ఈ సందర్భంగా ఆయనను ఆదిత్య విశ్వవిద్యాలయ డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ డాక్టర్ మేడపాటి శ్రీనివాసరెడ్డి ప్రో. ఛాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్. ఎంబి.శ్రీనివాస్, ప్రో.వైస్ ఛాన్సలర్లు డాక్టర్ ఎస్.రమాశ్రీ, డాక్టర్ ఆదిరెడ్డి రమేష్, డాక్టర్ రవితంగజన్, రిజిస్ట్రార్ డాక్టర్ జి.సురేష్, వివిధ విభాగాల డీన్‌లు ఆఫీస్ సిబ్బంది అభినందించారు.